క్లుప్తంగా...

ఉప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



బండారి లక్ష్మారెడ్డిని సత్కారిస్తున్న నాచారం వాసులు

మల్లాపూర్: ఉప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నాచారంలోని హనుమాన్ దేవాలయం, కౌండిన్యనగర్, నాచారం ఓల్డ్ విలేజ్‌లో పలువురిని కలిసి మద్దతు కోరారు. భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఊట్కూరి కాశీ విశ్వనాథ్‌గౌడ్, కుమార్‌గౌడ్, రాజేష్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, రాజుగౌడ్, భూపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, చందుగౌడ్, సుధాకర్‌రెడ్డి, సాయి, మనోహర్, బీఆర్ఎస్ నేత సాయిజెన్‌శేఖర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

బోడుప్పల్: 24వ డివిజన్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు వేయాలని సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలను గురించి తెలుసుకున్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలకు దశలవారీగా పరిష్కారం చూపుతామన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేద్దాం



ఝాన్సీ లక్ష్మీబాయి

బోడుప్పల్: తెలుగు భాషాభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు కవులు, కళాకారులు, భాషాభిమానులు కలిసి కృషి చేద్దామని తెలుగు రచయిత్రి కన్నారం ఝాన్సీ లక్ష్మీబాయి అన్నారు. చెంగిచర్లలో ఆమె సోమవారం మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె మాట్లాడుతూ కమనీయ భావాల రూపుదాల్చు, రమణీయ దృశ్యాలు ఆవిష్కరించు, వీనుల విందుగా తేనెలు చిందు విధంగా తెలుగు భాష ఉంటుందన్నారు. తెలుగు రచయిత్రిగా సామాజిక పరమైన కథలు, కవిత్వాలు, గత చరిత్రపై సామాజిక విశ్లేషణ చేసినట్లు వెల్లడించారు. తెలుగు భాషను కాపాడుకునేందుకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

కుషాయిగూడ: అనారోగ్యంతో మృతిచెందిన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, ఎన్‌టీఆర్‌నగర్ కాలనీకి చెందిన ఎల్లమ్మ కుటుంబ సభ్యులకు బీఎల్ఆర్ ట్రస్టు ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆపదలో ఉన్నవారికి బీఎల్ఆర్ ట్రస్టు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మధు, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపు ఉత్తర్వులను అందజేస్తున్న షకీలారెడ్డి

మల్లాపూర్: టీడీపీ అనుబంధ విభాగం తెలుగు మహిళా రాష్ట్ర కమిటీలో మల్లాపూర్, నాచారం డివిజన్లకు చెందిన పార్టీకి చెందిన సీనియర్ మహిళలకు చోటు దక్కింది. కార్యనిర్వాహక కార్యదర్శులుగా నియమిస్తూ మల్లాపూర్‌కు చెందిన మునిగేటి మేరి, నాచారం డివిజన్‌కు చెందిన గౌడేల్లి సావిత్రికి సోమవారం మహిళా విభాగం అధ్యక్షురాలు బి.షకీలారెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతాన్ని తనవంతు కృషి చేస్తామన్నారు.

జ్ఞాపకశక్తిని పెంచే ఎసెన్షియల్ ఆయిల్స్..

సాక్షి, సిటీబ్యూరో: యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా(ఇర్విన్) నిర్వహించిన అధ్యయనం ఎసెన్షియల్ ఆయిల్ వినియోగంతో వృద్ధులలో నేర్చుకునే, గుర్తుంచుకునే శక్తి పెరుగుతున్నట్లు గుర్తించిందని నగరానికి చెందిన వెల్‌నెస్ కంపెనీ 3000 బిసి థెరప్యూటిక్స్ ప్రతినిధులు తెలిపారు. వృద్ధాప్యంలో జ్ఞాపకశక్తిని కోల్పోయే పరిస్థితిని నివారించడానికి ఈ ఆయిల్స్ నిద్రలో కూడా ప్రభావాన్ని చూపుతాయని, ఈ నేపథ్యంలో ఆయిల్స్‌ను మేళవించిన పలు రకాల ఉత్పత్తులను తాము అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ నేపథ్యంలో తమ ఉత్పత్తులతో కూడిన బహుమతుల శ్రేణిని విడుదల చేశారు.

ముంపు సమస్యను పరిష్కరించాం



ఆదర్శనగర్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ముంపు సమస్యను దాదాపు పరిష్కరించామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సోమవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ.67 లక్షలతో డ్రైనేజీ పునర్నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల క్రితం చిన్నపాటి వర్షానికే కాలనీలు ముంపునకు గురయ్యేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. దాదాపు ముంపునకు గురయ్యే కాలనీల్లో బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం...

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ డీఏవీ స్కూల్ వద్ద వినోభానగర్‌లో రూ.35 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ దీపక్, జీఏన్‌వీ.సతీష్‌కుమార్, గుండా నిరంజన్, సూరి, ఓం ప్రకాష్, ఫరీద్, ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణగుప్తా, శ్రీను, భాస్కర్, నాగరాజు, ఆగమయ్య, బాలరాజు యాదవ్, సత్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



ఆలయ భూమిపూజలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్



ఆలయ భూమిపూజలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ శుభోదయ కాలనీలో పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. పూజల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్, బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తమ తోడ్పాటు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, పావనీరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్వీఎస్ఎస్ హయాంలోనే ఉప్పల్ అభివృద్ధి

కుషాయిగూడ: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హయాంలోనే అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేతలు పూసల బ్రహ్మచారి, కె.గోపాల్‌రెడ్డి, మునిగంటి రాంప్రదీప్ అన్నారు. సోమవారం హెచ్‌బీకాలనీలో వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలు, అవసరాలపై విజన్ కలిగిన నేతగా తనదైన శైలిలో కేంద్రం నుంచి నిధులు రాబట్టి ఉప్పల్ అభివృద్ధికి బాటలు వేశారన్నారు. గతంలో ఆయన చేసిన అభివృద్ధి పనులకే ప్రస్తుత అధికార పార్టీ నేతలు ప్రారంభోత్సవాలు చేస్తూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌పై విమర్శలు చేసే స్థాయి చోటా మోటా నాయకులకు లేదన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి పోటీలో నిలవడం, ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్లపల్లి లింగం, తిమ్మారెడ్డి, ఉమారాణి, శశికళ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రూ.19 లక్షలతో పార్కును అభివృద్ధి చేశాం



పార్కును సందర్శిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ నార్త్ కళ్యాణపురి పార్కును రూ.19 లక్షలతో ఆధునిక హంగులతో అభివృద్ధి చేసినట్లు స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సోమవారం పార్కును సందర్శించారు. డివిజన్‌లో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని వాటితో పాటు శ్మశానవాటికలను ఆధునిక హంగులతో వైకుంఠ ధామాలుగా మారుస్తున్నట్లు తెలిపారు. రోడ్డు, డ్రైనేజ్, తాగునీరు తదితర మౌలిక అంశాల కల్పనలో ముందున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ నిఖిల్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి నర్సింగరావు, ఏఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ సాధనే లక్ష్యం



మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తూ..

అల్వాల్: వైశ్య కార్పొరేషన్ సాధన లక్ష్యమని తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు గౌరిశెట్టి మునీందర్ అన్నారు. సోమవారం అల్వాల్ పట్టణంలో స్థానిక ఆర్యవైశ్యులు వైశ్య కార్పొరేషన్ సాధన కోసం చేపట్టిన బైక్ ర్యాలీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అల్వాల్ పట్టణంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి బైక్ ర్యాలీతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని వినతి పత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ హామీ మేరకు వైశ్య కార్పొరేషన్ ప్రకటించారన్నారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీనివాస్, సకిలం రాజు, విశ్వేశ్వర్‌రావు, బచ్చు చంద్రశేఖర్, పోద్దుటూరి రాములు, రాగి రమేష్, గంగ మలేష్, మందుమూల వీరేశం, తేలుకుంట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి అరెస్టు

కుషాయిగూడ: జల్సాల కోసం దొంగతనాలు చేస్తూ దర్జాగా తిరుగుతున్న ఓ దొంగను కుషాయిగూడ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.35 లక్షల సొత్తును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబుబాబాద్ జిల్లా, నెల్లికుదురు మండలం, నల్లగుండ తండాకు చెందిన గుగులోతు నవీన్(19) 2021లో నగరానికి వచ్చాడు. తండ్రి నామ్‌దేవ్ కాప్రాలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నవీన్ చిన్ననాటి దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. కొంత కాలం తర్వాత నవీన్ కుటుంబ సభ్యులు సొంతూరికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి నవీన్ అక్కడ తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డాడు. పలు మార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. కొద్ది కాలం కాప్రాలో ఉండటంతో ఇక్కడ దొంగతనాలు మొదలుపెట్టాడు. సోమవారం నేతాజీనగర్ చౌరస్తా వద్ద కుషాయిగూడ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. పలు వస్తువులను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ నేత ఆకుల మహేందర్ జన్మదిన వేడుకలు



ఉప్పల్: ఉప్పల్ బీఆర్ఎస్ నేత ఆకుల మహేందర్ జన్మదిన వేడుకలు సోమవారం రామస్వామి ఫంక్షన్ హాల్‌లో అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, అభిమానులను కడుపులో పెట్టి చూసుకుంటామన్నారు. చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మదిరాజ్, బీఆర్ఎస్ నేత సాయిజెన్ శేఖర్, అన్యబాల కృష్ణ, పోగుల దయాకర్‌రెడ్డి, బొట్టు వెంకట్, రాంరెడ్డి నాయబు వెంకటేష్, ఈగ సంతోష్, పిల్లి నాగరాజు, చింతల నర్సింహరెడ్డి, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలి



న్యూవెంకటేశ్వరనగర్‌లో బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్

గౌతంనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని న్యూవెంకటేశ్వరనగర్‌లో రూ.18 లక్షలతో కొనసాగుతున్న బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ దివ్యజ్యోతి, నాయకులు మేకల రాముయాదవ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు ఉన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు



అల్వాల్: ప్రజా గాయకుడు గద్దర్ మృతి బహుజన సమాజానికి తీరని లోటని బీఏఎంసీఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు మేఘ్రం అన్నారు. సోమవారం అల్వాల్‌లోని వెంకటాపురం భూదేవినగర్‌లో గద్దర్ నివాసంలో ఆయన భార్య విమల, కుమారుడు సూర్యం, కూతురు వెన్నెలను ఆయన కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మేఘ్రం మాట్లాడుతూ గద్దర్ మృతి మూలనివాసి బహుజన సమాజానికి తీరని లోటు అన్నారు. అనంతరం ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. గద్దర్ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో బీఏఎంసీఎఫ్ నాయకులు వివి జాదవ్, బట్టి చెన్నయ్య, సుధీర్‌నాగ్, డాక్టర్ కుమార్, ఆర్ఎంసీ జాతీయ నాయకులు సురేందర్‌సింగ్, బీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌బట్టు తదితరులు ఉన్నారు.

టాక్స్ చెల్లించని మద్యం పట్టివేత

ఉప్పల్: టాక్స్ చెల్లించని మద్యాన్ని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పాతబస్తీ ఆసిఫ్‌నగర్ ప్రాంతానికి చెందిన మనీష్ అగ్రవాల్(30), కార్వాన్ ప్రాంతానికి చెందిన రాచకొండ అరుణ్‌కుమార్(31) మణికొండ ప్రాంతానికి చెందిన రేగటి శ్రీను(40) ముఠాగా ఏర్పడి అంతరాష్ట్ర మద్యాన్ని నగరంలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం 43 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మద్యం సరఫరా చేసే వ్యక్తి భగవాన్ దాస్‌రాయ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అరోరాలో మెగా రక్తదాన శిబిరం



మేడిపల్లి: అరోరా గ్రూప్ సంస్థల చైర్మన్ దివంగత నిమ్మటూరి రాజాబాబు జయంతి సందర్భంగా పర్వతాపూర్‌లోని అరోరా టెక్నాలజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కాలేజ్‌లోని ఎన్ఎస్ఎస్ విభాగం, అభయ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అరోరా గ్రూపు సంస్థల వైస్ చైర్మన్ నిమ్మటూరి అనుదీప్ ప్రారంభించి మాట్లాడారు. అన్నిదానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని అందరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.మహేష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వేణుగోపాల్‌రెడ్డి, అభయ బ్లడ్ సెంటర్ ప్రతినిధి హరిదాస్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఆటో మొబైల్స్ స్పేర్‌పార్ట్స్‌ను విక్రయిస్తున్న ముఠా అరెస్టు

అల్వాల్: ఆన్‌లైన్‌లో నకిలీ ఆటో మొబైల్ స్పేర్ పార్ట్స్‌ను కొనుగోలు చేసి బ్రాండెడ్ స్టిక్కర్ వేసి విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. అల్వాల్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన గణపతి కుమావత్(28) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి అల్వాల్‌లోని సాయిదుర్గ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆన్‌లైన్‌లో తక్కువ ధరకు ఆటో మొబైల్ స్పేర్ స్పార్ట్స్ కొనుగోలు చేసి వాటిని బ్రాండెడ్ కవర్లలో ప్యాక్ చేసి ఆటో మొబైల్ షాపులలో విక్రయిస్తున్నారు. ఎస్ఓటి పోలీసులు గోదామ్, విక్రయిస్తున్న దుకాణాలపై సోదాలు చేసి నకిలీ స్పేర్ పార్ట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గణపతి కుమార్‌తో పాటు ఆటో మొబైల్ షాపు నిర్వాహకులు శ్రవణ్‌కుమార్(25), సురేష్‌చంద్(32) ఓమ్‌రామ్ నింబవత్(38), రాజురామ్(24) దిలిప్ జాత్(25)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మ్యాన్‌హోల్ సమస్యకు 24 గంటల్లో పరిష్కారం



ఫ్రీడం ఫ్రం మెషిన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మేయర్, కమిషనర్

బోడుప్పల్: పాడైన మ్యాన్‌హోల్ పరిష్కారం కోసం డ్రైనేజీ మెషిన్(మ్యాన్) పేరుతో 24 గంటల్లో పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి కలిసి ఫ్రీడం ఫ్రం మెషిన్(మ్యాన్) పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో మ్యాన్‌హోల్స్ పాడైతే ఫిర్యాదుదారులు కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 040–27215959, బోడుప్పల్ ప్రజాఫిర్యాదుల విభాగానికి ఫిర్యాదు అందిన 24 గంటల్లో రిపేరు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఈలు శారద, బాలమురళి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగాలి



నాయకులుగా ఎన్నికైన విద్యార్థులు

అల్వాల్: ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగాలని లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ కె. సదానంద్ అన్నారు. టెంపుల్ అల్వాల్‌లో లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థలో సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఇన్వెస్టీచర్ సెర్మనీ ఘనంగా నిర్వహిచారు. లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థ చైర్మన్ సదానంద్, ప్రిన్సిపల్ జ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు లక్కీ శామ్యూల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదానంద్ మాట్లాడుతూ విద్యార్థి నాయకులుగా పదవీ బాధ్యతలు చేపట్టిన వారిని అభినందించారు. పాఠశాల ప్రారంభ దశ నుంచి ఈ వేడుకను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి ఆకట్టుకున్నారు.

కార్యకర్తలు బూత్‌స్థాయి నుంచే కృషి చేయాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: కాంగ్రెస్ గెలుపునకు ప్రతి కార్యకర్త బూత్‌స్థాయి నుంచే కృషి చేయాలని కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. సోమవారం అల్వాల్‌లోని పార్టీ కార్యాలయంలో రాబోయే ఎన్నికల్లో అనుసరించే కార్యాచరణ గురించి పార్టీ శ్రేణులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే బూత్ లెవెల్ ఏజెంట్లను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డోలి రమేష్, చంద్రశేఖర్, బలరామ్, జీడీ శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, రాజలింగం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో అభివృద్ధి శూన్యం

రాగిడి లక్ష్మారెడ్డి



గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో రాగిడి తదితరులు

రామంతాపూర్: తొమ్మిదేళ్లుగా రామంతాపూర్ డివిజన్ పరిధిలో ఎటువంటి అభివృద్ధి పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. డివిజన్ పరధిలోని నెహ్రూనగర్ ఇందిరానగర్, రాజేంద్రనగర్, గాంధీనగర్, శ్రీరామ కాలనీ, ఓల్డ్ రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో సోమవారం పార్టీ నిర్వహించిన గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ డీమార్ట్ ఇందిరానగర్ రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యి ఏళ్లు గడుస్తున్నాయి. అదేవిధంగా ఇందిరానగర్, రాజేంద్రనగర్, ఓల్డ్ రామంతాపూర్ శ్రీరామ్ కాలనీలో కలుషిత తాగునీరు సరఫరా, అస్తవ్యస్తంగా భూగర్భ డ్రైనేజీలు, గుంతల రోడ్లు వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడించి స్థానిక ప్రజలతో కలిసి పెద్దఎత్తున ధర్నాకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పత్తి కుమార్, శ్రీనివాస్ యాదవ్, సంజయ్ జైన్, అశు, సుధాకర్, అబ్దుల్ రషీద్, మహ్మద్, రఫీక్, జలీల్, పాషా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న బీఎన్‌రెడ్డినగర్ కాలనీవాసులు

కుషాయిగూడ: ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలపై బీఎస్‌రెడ్డినగర్, లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కాలనీ అవసరాలు, మౌలిక వసతుల కల్పన, రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు, వీధి దీపాలు, కరెంటు పోల్స్ ఏర్పాటు వంటి పలు సమస్యలను వారు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం లభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాన్‌రెడ్డి, శంకర్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహరెడ్డి, శివచరణ్, శేఖర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధులు

కుషాయిగూడ: 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటు నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ అభ్యర్థి, బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం ఈసీఐఎల్ చౌరస్తాలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. తన ట్రస్టు ఆధ్వర్యంలో ఓటు నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులపై కూడా వారు అవగాహన కల్పిస్తున్నారు. కార్డుల కోసం రుసుము చెల్లించి పేదల కోసం దరఖాస్తు చేస్తున్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా సుదర్శన హోమం



మహా సంప్రోక్షణకు ఊరేగింపుగా..



పూజలో మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాల్గవరోజు సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, మహాకుంభ సంప్రోక్షణ, పుష్పయాగం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, ఈవో రవీందర్‌రెడ్డి, క్లర్క్ సుధాకర్, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసిరమణాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.